రోడ్లపైనే పార్కింగ్‌ !

ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు

- పారిశ్రామికవాడలో రాత్రి పూట ప్రమాదాలు
- పట్టించుకోని ఐలా అధికారులు



ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం



స్తంభించిన వాహనాల రాకపోకలు

జీడిమెట్ల: పారిశ్రామికవాడ రోడ్లపై గంటల తరబడి వాహనాలు పార్కింగ్‌ చేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట చూసుకోకుండా వాహనాలకు గుద్దుకుని గాయాలపాలవుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో నిత్యం ఇదే తంతూ కొనసాగుతుండటంతో కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మే నెలలో ఓ ద్విచక్ర వాహనదారుడు రాత్రి రోడ్డుపై ఉన్న లారీని ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు.

ప్రతి నిత్యం ట్రాఫిక్‌ జాం..

జీడిమెట్ల నుంచి ఫేజ్‌ 5 వైపు వచ్చే రోడ్డులో ఓ స్టీల్‌ పరిశ్రమకు అన్‌ లోడింగ్‌, లోడింగ్‌ నిమిత్తం వచ్చే వాహనదారులు ప్రతినిత్యం రోడ్లపై పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో ఉదయం, మధ్యాహ్నం జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డుతో పాటు జీడిమెట్ల ఫేజ్‌ 5లో భారీగా ట్రాఫిక్‌ జాం అవుతుంది. ఈ విషయమై వాహనదారులు ఇప్పటికే జీడిమెట్ల ట్రాఫిక్‌ పోలీసులతో పాటు ఐలా అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్‌ సదుపాయం లేక..

ప్రతినిత్యం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతానికి ఇతర రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. పారిశ్రామిక ప్రాంతంలో సరైన పార్కిగ్‌ స్థలం లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు జీడిమెట్లలో ఉన్న కొన్ని టీజీఐఐసీ స్థలాలను వాహనాల పార్కింగ్‌ కోసం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పార్కింగ్‌ చేసిన వాహనాలు

రాత్రిపూట ఇబ్బందిగా ఉంది



మా కాలనీకి జీడిమెట్ల డిపో నుంచి పారిశ్రామికప్రాంతం రోడ్డు ద్వారా రావాల్సి ఉంటుంది. కాలనీకి 40 ఫీట్ల పెద్ద రోడ్డు ఉంది. అయినప్పటికీ రోడ్డులో సగభాగం వరకు అక్రమ పార్కింగ్‌కు పోవడంతో కాలనీకి రావడం ఇబ్బందిగా ఉంది. రాత్రిపూట చూసుకోకుండా కాలనీ ప్రజలు రోడ్డుపై ఆగి ఉన్న లారీలకు గుద్దుకుని గాయాలపాలవుతున్నారు. ఇప్పటికై నా అధికారులు పట్టించుకుని రోడ్లపై అక్రమంగా పార్కింగ్‌ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి.

- మహేందర్‌, ఎస్‌.ఆర్‌.నాయక్‌నగర్‌

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్‌ నేతలు



నిజాంపేట్‌: జిల్లా కలెక్టర్‌గా మను చౌదరి నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం పలువురు కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అనుమతులు పొందిన సంస్థపై చర్యలు తీసుకోవాలి



కార్పొరేషన్‌ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిజాంపేట్‌: ప్రభుత్వ భూముల్లో ఓ ప్రైవేట్‌ నిర్మాణ సంస్థ అనుమతులు రద్దు చేయాలని గురువారం ఆకుల సతీష్‌ నిజాంపేట్‌ కార్పొరేషన్‌ మేనేజర్‌ పవన్‌ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలో ప్రగతినగర్‌ సాయినగర్‌ కమాన్‌ ఆనుకుని సర్వే నంబర్‌ 141 ప్రైవేట్‌ ల్యాండ్‌లో భూమి చూపిస్తూ సర్వే నంబర్‌ 142 ప్రభుత్వ భూమి 6.5 గుంటలు ఆక్రమించుకుని అక్రమ అనుమతులు పొందిన నిర్మాణ సంస్థపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్‌, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూట్‌ బ్యాగులను వినియోగించాలి



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

దుండిగల్‌: ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించాలని, ప్లాస్టిక్‌కు బదులుగా జూట్‌ బ్యాగులను వినియోగించాలని దుండిగల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్‌ నాయక్‌ అన్నారు. సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ బ్యాన్‌లో భాగంగా దుండిగల్‌ మున్సిపల్‌ పరిధిలో స్పెషల్‌ టీమ్‌లను ఏర్పాటు చేశారు. గురువారం వివిధ హోటళ్లు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ వాడే కిరాణా షాపులు, హోటల్స్‌, చికెన్‌, మటన్‌ దుకాణాలపై దాడులు చేసి సింగల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ వినియోగించే వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య, ఎన్విరాన్మెంట్‌ ఇంజినీర్‌ సాత్విక్‌, వార్డు అధికారులు, జవాన్లు, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆక్యుపంచర్‌పై అవేర్‌నెస్‌ క్యాంపు

చింతల్‌: ఉషారాణి మెమోరియల్‌ ట్రస్ట్‌, ఉషారాణి నేచురుపతి క్లినిక్‌ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆక్యుపంచర్‌ అవేర్‌నెస్‌ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఉషారాణి నేచురోపతి క్లినిక్‌ నిర్వాహకురాలు స్పిరిట్యువల్‌ డాక్టర్‌ రాధిక అక్యూపంచరిస్ట్‌ గురువారం తెలిపారు. చింతల్‌ రామ్కీ అపార్ట్‌మెంట్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



సుభాష్‌నగర్‌: తప్పిపోయిన బాలుడిని పోలీసులు శ్రమించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సూరారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్‌ వివరాల ప్రకారం.. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని శివాలయనగర్‌లో విగ్నేష్‌ అనే ఆరేళ్ల బాలుడు గురువారం ఉదయం అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సూరారం పోలీసులను ఆశ్రయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చుట్టుప్రక్కల సీసీ కెమెరాలు జల్లెడ పట్టారు. సూరారం గ్రామం వైపు వెళ్తున్నట్లు గమనించి అక్కడ వెతకగా స్థానికంగా ఉన్న శివాలయంలో బాలుడిని గమనించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆ తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధం ఆపాలని వామపక్షాల నిరసన



రంగారెడ్డినగర్‌: పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయెల్‌ దాని మిత్ర దేశం అమెరికా దురాక్రమణ చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్‌ అన్నారు. పాలస్తీనా, ఇరాన్‌లపై దాడులను ఖండిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌ రైతు బజారు నుంచి సాగర్‌ హోటల్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్‌, అమెరికాలు ఏకపక్షంగా సాగిస్తున్న యుద్ధంతో పాలస్తీనాలో ఎంతో మంది మృత్యువాత పడ్డారని, పిల్లలు ఆకలికి అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఇరాన్‌పై అకారణంగా ఇజ్రాయెల్‌ చేస్తున్న దాడులను బేషరుతుగా ఆపాలని, ప్రపంచ శాంతిని నెలకొల్పేందుకు ఐక్యరాజ్య సమితి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కీలుకాని లక్ష్మణ్‌, సీపీఐ మండల కార్యదర్శి స్వామి, నరసింహారెడ్డి, రమేష్‌, కనకయ్య, రాజశేఖర్‌, లింగస్వామి, స్వాతి, దేవదానం, కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



సన్మానిస్తున్న ఎంఈఓ జెమిని కుమారి, జీడిమెట్ల సీఐ మల్లేశం

చింతల్‌: విదార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ జెమిని కుమారి, జీడిమెట్ల సీఐ మల్లేశం అన్నారు. గురువారం నెహ్రూనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో 2024–25 బ్యాచ్‌ టెన్త్‌ టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల అడుగు జాడల్లో నడుస్తూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటే పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారన్నారు. ఉన్నత చదువుల్లో సైతం రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌ హార్ట్స్‌ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌, ధాత విరేంద్రసింగ్‌రాథోడ్‌, హెల్పింగ్‌ హార్ట్స్‌ మెంబెర్‌ సాజిద్‌ , ఉపాధ్యాయులు నాగమణి, రాజమణి. జగదీష్‌, సుధాకర్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలు సీజ్‌



సీజ్‌ చేసిన ఏవీ మోడల్‌ స్కూల్‌ వద్ద ఎంఈఓ జెమినికుమారి

రంగారెడ్డినగర్‌: అనుమతి లేని ప్రైవేట్‌ పాఠశాలల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్‌ మండల విద్యాధికారి జెమిని కుమారి అన్నారు. గురువారం సుభాష్‌నగర్‌ డివిజన్‌ పరిధి సాయిబాబానగర్‌లోని ఏవీ స్కూల్‌, ఏవీ మోడల్‌ స్కూళ్లను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలుసార్లు ఏవీ మోడల్‌ స్కూల్‌ యాజమాన్యానికి నోటీసులు అందించామని, అయినా సదరు యాజమాన్యం స్పందించలేదన్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏవీ స్కూల్‌, ఏవీ మోడల్‌ స్కూళ్లను సీజ్‌ చేశామన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు పొందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. మండల పరిధిలో అనుమతులు లేని పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందాలని, లేనిపక్షంలో దాడులు నిర్వహించి సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చింతల్‌: విద్యుత్‌ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ గన్‌రాక్‌ సబ్‌ స్టేషన్‌ ఎండీఎఫ్‌ ఫీడర్‌ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మానస సరోవరం ఫేజ్‌ 1 మానస సరోవరం ఫేజ్‌ 2, మానస సరోవరం ఫేజ్‌ 3, ఎల్బీనగర్‌, జీపీ సంఘం, భవానీనగర్‌ తదితర ప్రాంతాలు, తిరుమలగిరి సబ్‌ స్టేషన్‌ ఖానాజిగూడ ఫీడర్‌ పరిధిలో తిరుమలనగర్‌, గ్రీన్‌ ఫీల్స్‌ కాలనీ, ఖానాజిగూడ, సాయి సాగర్‌ కాలనీ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

మయూరి సబ్‌స్టేషన్‌ ఫీడర్‌లో..

నిజాంపేట్‌: మయూరి సబ్‌స్టేషన్‌ 11కేవీ మయూరి నగర్‌ ఫీడర్‌లో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఆర్క్‌ టవర్స్‌, మయూరి నగర్‌ భాగం, ఎస్‌బీఐ బ్యాంక్‌ రోడ్డు, వృద్ధాశ్రమం అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విత్రా హిల్స్‌, ఏఎస్‌ రాజు నగర్‌, ప్రశాంత్‌నగర్‌, వెర్టెక్స్‌ ప్రైమ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

సుభాష్‌నగర్‌: వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా నర్సాపూర్‌ మండలం నాగులపల్లికి చెందిన విస్లావత్‌ సాయికుమార్‌ (21) చర్చి గాగిలాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తన పల్సర్‌ బైక్‌పై చింతల్‌లోని తన బంధువుల వద్దకు వెళ్తున్నాడు. సూరారం సాయిబాబానగర్‌ చౌరస్తాకు రాగానే ఇసుక లోడుతో కరీంనగర్‌ నుంచి కూకట్‌పల్లికి వెళ్తున్న లారీ వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన సాయికుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు లారీ డ్రైవర్‌ అన్నప్పను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు తండ్రి లక్ష్మణ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు

దుండిగల్‌: మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను చేపట్టడమే తమ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం దుండిగల్‌ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ కాలనీల సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సంకల్ప సభను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌.మల్లారెడ్డి తదితరులు

దుండిగల్‌: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్‌ ఎస్‌.మల్లారెడ్డి అన్నారు. కేంద్రం ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 22న సికింద్రాబాద్‌ ఇంపీరియల్‌ గార్డెన్స్‌లో సంకల్ప సభ నిర్వహించనున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ ఆధ్వర్యంలో జరుగనున్న సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం దుండిగల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌ పార్లమెంట్‌ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ దుండిగల్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విఘ్నేశ్వర్‌, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌ రావు, కిసాన్‌ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, మున్సిపల్‌ ప్రధాన కార్యదర్శి భానుగౌడ్‌, సీనియర్‌ నాయకులు ఏ మల్లేష్‌ యాదవ్‌, ఆకుల మల్లేష్‌, నర్సింహా చారి, వెంకటేష్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ సిగ్నల్‌ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రగతినగర్‌లో ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్‌ కమిషనర్‌కు నివేదించినా మార్పు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆలీఫ్‌ సర్కిల్‌, ఐకానిక్స్‌ సర్కిల్‌, మూడు కోతుల జంక్షన్‌ వద్ద స్కూల్‌ బస్సులు, ఉద్యోగుల పికప్‌ బస్సులు, ఆలీఫ్‌ ఇండస్ట్రియల్‌కు సంబంధించిన వాహనాలు, నీటి ట్యాంకర్లు, ప్రైవేట్‌ వాహనాలతో అనునిత్యం రద్దీగా మారిందన్నారు. ఈ మేరకు మియాపూర్‌ ట్రాఫిక్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌ స్పందించి.. ఫీల్డ్‌ వెరిఫికేషన్‌ చేసి ట్రాఫిక్‌ కానిస్టేబుల్స్‌ను జంక్షన్‌ వద్ద ఉండేలా చూస్తామని తెలిపారు. అదేవిధంగా పై అధికారులకు వివరించి ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర చౌదరి, డాక్టర్‌ రాజు, సుమన్‌రావు, రవి యాదవ్‌, మదన్‌ మోహన్‌, కిషోర్‌, మందపాటి శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్‌గుప్తా, నరేష్‌, రామకృష్ణ, లక్ష్మి, కోశాధికారి రవి, అనిరుద్ర, వేణుమాధవ్‌, రాహుల్‌ పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్‌: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని బీఆర్‌ఎస్‌ పార్టీ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు, శుభకార్యాలకు సంబంధించి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నానని, స్థానిక సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశిస్తానన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన అవసరం



కుత్బుల్లాపూర్‌: రోడ్డు భద్రత, ట్రాఫిక్‌ రూల్స్‌పై పాఠశాల స్థాయి నుండే అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జీడిమెట్లలోనీ జడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల విద్యార్థులతో అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ నిబంధనలపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసీపీ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాన రహదారిలో రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సిగ్నల్స్‌, జీబ్రా క్రాసింగ్‌ వద్ద రోడ్డును దాటాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని, త్రిబుల్‌ డ్రైవింగ్‌, మొబైల్‌ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు, అధ్యాపక బృందం, అల్వాల్‌ ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్‌: ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్‌ కార్పొరేటర్‌ జగన్‌ అన్నారు. మగ్దూమ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్‌(37) అనారోగ్యంతో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఆయన రూ. 2 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్‌ నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. సదరు ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో జగన్‌ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు రుద్ర అశోక్‌, నాయకులు పాపులుగౌడ్‌, సాజిద్‌, మద్ది శ్రీనివాస్‌, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్‌ జగన్‌

ప్రమాదకరంగా మ్యాన్‌ 'హోల్‌'



జీడిమెట్ల డివిజన్‌ పరిధిలోని ఏరోనాటికల్‌ ఎన్క్లేవ్‌ ప్రధాన రోడ్డుపైనే ఉన్నా మ్యాన్‌ హోల్‌ ప్రమాదకరంగా ఉంది. చుట్టుపక్కల ఉన్న స్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రతినిత్యం ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. మ్యాన్‌ హోల్‌ మూత సరి చేయాలని ఇప్పటికే పలు పర్యాయాలు స్థానిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గత వారం రోజులు నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత సరి చేయాలని కోరుతున్నారు. -కుత్బుల్లాపూర్‌

కొన..సాగుతూనే !

షాపూర్‌ నగర్‌ ప్రధాన చౌరస్తాలో ఉన్న ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ చుట్టుపక్కల ఉన్న సర్వీస్‌ రోడ్డు ఏర్పాటు చేయలేదు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జి ఎందుకు పనికి రాకుండా పోతుంది. ఇదిగో.. ప్రారంభోత్సవం అంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ఈ నిర్మాణ పనుల విషయంపై నిర్లక్ష్యం వహించడం మూలంగా రెండు సంవత్సరాలుగా పనులు కొన...సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. -కుత్బుల్లాపూర్‌



లీకేజీపై ఎందుకంత లేజీ!



వేంకటేశ్వర కాలనీ సాగర్‌ టైలర్‌ సర్కిల్‌ వద్ద ప్రతినిత్యం మంచినీటి లీకేజీతో నీరు వృథాగా పోతుంది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో మూడు రోజుల క్రితం వాటర్‌ వర్క్స్‌ కాంట్రాక్టర్‌ మరమ్మతులు చేసి వెళ్లారు. బుధవారం నీటి సరఫరా జరుగుతుండగా తిరిగి అదే ప్రాంతంలో మంచినీటి లీకేజీ ఏర్పడడం విశేషం. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో చేసిన పని తిరిగి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రతిసారి ఫిర్యాదు చేసిన వారం, పది రోజుల తర్వాత వచ్చి చూస్తున్నారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో వెంటనే వాటర్‌ వర్క్స్‌ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. -కుత్బుల్లాపూర్‌